# బీఆర్ఎస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి



హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

- ప్రతి ఇంటికీ అందుతున్న సంక్షేమ పథకాలు
- ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 5 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించారని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. ఆదివారం హాలియాలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ అనుముల మండల బూత్‌స్థాయి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. పార్టీ బూత్ కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి 7 సార్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా పనిచేసినప్పటికీ నాగార్జునసాగర్ నియోజకవర్గానికి, ఆయన సొంత మండలమైన అనుములను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యాడన్నారు. రేపు ఆయన కొడుకు వచ్చి చేయబొయ్యేది కూడా ఏమీ లేదన్నారు. నియోజకవర్గ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేయలేకపోయారన్నారు. ఐదేండ్ల క్రితమే నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు జానారెడ్డిని తిరస్కరించాలని, అందుకే ఈ సారి ఆయన పోటీ చేయలేక కొడుకును ఎన్నికల బరిలో నిలిపారని తెలిపారు. జానారెడ్డి 15 ఏండ్లు రికార్డు స్థాయిలో క్యాబినెట్ మంత్రిగా పనిచేయడం వల్ల ఆయన కుటుంబానికే లాభం కలిగింది తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం జరుగలేదని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజాబలం లేకపోవడంతోనే ఎన్నికల వేల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసేందుకు ఆ పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలం ఉన్న బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ రైతుల శ్రేయస్సు దృష్ట్యా వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారని.. కానీ కాంగ్రెస్ నాయకులు మాత్రం సాగుకు కేవలం 3 గంటల విద్యుత్ చాలని చెబుతున్నారని పేర్కొన్నారు. రైతుబంధు డబ్బులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి : ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

స్వరాష్ట్రంలో పదేండ్లుగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోనికి వస్తే చేపట్టబోయే పనులు, పార్టీ మ్యానిఫెస్టోను బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వివరించాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సూచించారు. హాలియాను మున్సిపాలిటీగా చేయడంతో పాటు అనుముల మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రాబోయే ఎన్నికల్లో నోముల భగత్ గెలుపుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో సైనికుల్లా పని చేయాలని కోరారు.

### బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మే స్థితిలో లేరని, తమ సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడోసారి అధికారంలోకి తేవడానికి వారంతా సిద్ధంగా ఉన్నారని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో గిరిజనులకు, సబ్బండ వర్గాలకు మేలు జరిగిందన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో పాటు వాటికి అధిక నిధులు అందించి అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకట్వేర్లు, ఎంపీపీ సలహాదారుడు ఆవుల పురుశోత్తం, మున్సిపల్ వైస్‌చైర్మన్ నల్లగొండ సుధాకర్, సీనియర్ నాయకులు ఎడవల్లి మహేందర్‌రెడ్డి, కేవీ రామారావు, పట్టణాధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల సత్యం, దోరేపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం రమణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్‌నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు



పైలాన్ కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్తీ దవాఖాన

# బస్తీ వాసులకూ వైద్యసేవలు

- నందికొండలో రూ.13 లక్షలతో బస్తీ దవాఖాన ఏర్పాటు
- మారుమూల ప్రాంతాలకు అందనున్న వైద్యం

నందికొండ, నవంబర్ 5 : పేద ప్రజలకు సైతం కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించింది. దాంతో పాటు అందులో ఆధునిక పరికరాలతో పాటు సిబ్బందిని నియమించింది. దాంతో పాటు పల్లెలు, పట్టణాల్లోని మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వైద్య సేవలు అందించేందుకు పల్లె, బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసింది. ఇందులో వైద్య సిబ్బందితో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచింది.

### పైలాన్ కాలనీలో బస్తీ దవాఖాన

నందికొండలోని పైలాన్‌కాలనీలోని ఉన్న ప్రభుత్వ దవాఖాన భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.13లక్షలతో ఆధునీకరించింది. గత పాలకులు ఈ దవాఖానను పట్టించుకోక పోవడంతో క్రమంగా మూత పడింది. భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించింది. దవాఖానకు కావాల్సిన ఫర్నీచర్, పరికరాలను సమకూర్చింది. పూర్తిస్థాయిలో బస్తీ దవాఖానగా మార్చి ప్రారంభానికి సిద్ధం చేసింది.

### ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

నందికొండలో ఏరియా ఆస్పత్రి ఉంది. అందులో వైద్య సేవలు పూర్తిస్థాయిలో ఉచితంగా అందుతున్నాయి. అయితే శివారు కాలనీల ప్రజలకు చిన్న పాటి రోగం వచ్చినా సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏరియా దవాఖానకు రూ.50 ఖర్చు చేసి పోవాల్సి వస్తున్నది. కాలనీలో బస్తీ దవాఖాన ప్రారంభమైతే స్థానికంగానే వైద్య సేవలు అందనున్నాయి.

### ప్రారంభానికి సిద్ధం చేశాం

బస్తీ దవాఖానను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 లక్షలు కేటాయించిది. ప్రభుత్వం అందించిన నిధులతో భవనాన్ని ఆధునీకరించి వైద్య పరికరాలను కొనుగోలు చేశాం. అధికారుల ఉత్తర్వుల మేరకు దవాఖాను ప్రారంభించి రోగులకు అందుబాటులో ఉంచుతాం.

– వెన్నెల కుమార్, ఏఈ

# ఉర్సులో అలరించిన 'ఖవ్వాలి'

రామగిరి, నవంబర్ 5: నల్లగొండలోని గడియారం సెంటర్ సమీపంలోని హజ్రత్ సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రీ ఉర్సు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి దర్గా మెట్ల వద్ద నిర్వహించిన 'ఖవ్వాలి అందరిని ఆకట్టుకుంది. నాగ్‌పూర్, ఔరంగాబాద్, హైదరాబాద్‌కు చెందిన ఘౌసియా కౌసర్ బృందం సభ్యులు ఆలపించిన ఖవ్వాలి తెల్ల వారుజాము వరకు సాగింది. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఉర్సు ముతవల్లీలు సయ్యద్ సమి ఉల్లా ఖాద్రీ సాహెబ్, సయ్యద్ గౌస్ ఉల్లా ఖాద్రి సాహెబ్, సయ్యద్‌సల్మాన్ ఖాద్రీ సాహెబ్, జామ్ ఖాద్రీ, ఉర్సు ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ జాఫర్, ముస్లింలు పాల్గొన్నారు.



ఖవ్వాలి ఆలపిస్తున్న కళాకారులు

# పోగొట్టుకున్న మొబైల్స్ సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తింపు

- ఎస్ఐ హరిబాబు

అడవిదేవులపల్లి, నవంబర్ 5: సీఈఐఆర్ టెక్నాలజీతో పోయిన మొబైల్స్‌ను గుర్తిస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. మండలంలోని చింతచెట్టుతండాకు చెందిన నేనావత్ స్వామి, బంగారికుంటతండాకు చెందిన కారంతోద్ హరి తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకొని స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదుమేరకు సీఈఐఆర్ టెక్నాలజీతో ట్రాక్ చేయగా ఒకటి హైదరాబాద్‌లో, మరొకటి విజయవాడలో ఉన్నట్లు గుర్తించి అవి ఉన్న వ్యక్తులను పట్టుకొని మొబైల్స్‌ను స్వాధదీనం చేసుకొని బాధితులకు అందజేసినట్లు చెప్పారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే

- బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమం
- ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, నవంబర్ 5 : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని తెరాటిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటువారిగూడెం గ్రామానికి చెందిన 40 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి గ్రామ సర్పంచ్ జక్కల భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయన్నారు. లబ్ధిదారులంతా బీఆర్ఎస్‌తోనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో గుండెబోయిన రాములు, బుయ్యా లింగయ్య, జి.కోటేశ్, జి.శంకర్, బుయ్యా నాగరాజు, కటికర్ల శేఖర్, బోయిన అంజయ్య, బోయిన పెద్ద వెంకటయ్య, సైదులు, జినుకల శంకర్‌తో పాటు కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్ రావు, ఉపాధ్యక్షుడు వెలుగు రవి, ఉప సర్పంచ్ కసిరెడ్డి రామచంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరెడ్ల వెంకట్‌రెడ్డి, భీమనబోయిన అబ్బాస్, బైరు బలరాములు, వేముల యాదయ్య, షేక్ అమీర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాకప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి